



# ఉద్యోగధర్మం

"సులోచన"

క్రొత్తగా క్లాసులో కాలు పెడుతూ - గడపఅంచుకు చెప్పుకాలు తగిలి కొంచెం ముందుకు తూగాడు, నళినీకాంతం. అంతకు ముందు నిమిషంనించీ నిశ్శబ్దంగా వున్న 'క్లాసంతా నవ్వులతో మారుమోగిపోయింది. నళినీకాంతానికి చెమట్లు పట్టాయి. అదే క్రొత్తగా ఛార్జీ పుచ్చుకొని పంతులు వుద్యోగంలో ప్రవేశించటం. మెల్లగా అవమానభరిత హృదయంతో వొచ్చి కుర్చీలో కూర్చొని తల దించేసుకున్నాడు. పిల్లలకేసి చూడాలంటే మహా చెడ్డభయంగా వుంది. మళ్ళీ క్లాసు నిశ్శబ్దవాతావరణంలో మునిగింది. వెనక బెంచీలో కూర్చొన్న చిలిపిస్వభావ చలపతి 'మ్యావ్' అని పిల్లి కూతకుమల్లే అరిచాడు. ఇంకోసారి క్లాసు నవ్వులతో, కేరింతలతో ప్రతిధ్వనించింది. అతికష్టంమీద తలెత్తి చూశాడు, నళినీకాంతం; వీళ్లు తనని ఎగతాళి చేస్తున్నారు అని గ్రహించింతరువాత. చలపతి బెంచీలోంచి లేచి - 'సైలెన్సు, సైలెన్సు' అంటున్నాడు - ఇది మరీ దుర్భరంగాతోచింది, నళినీకాంతంకి. క్లాసులో గోలసద్దు మణిగింది. రెండోవరుస బెంచీలలో వెనుక బెంచీలో వున్న మాయమాధవుడు వుండివుండి 'కిచకిచ' అని అన్నాడు ఎలకకిమల్లే. క్లాసంతా ఘొల్లున నవ్వింది. తిరిగి చలపతి లేచి 'సైలెన్సు, సైలెన్సు' అన్నాడు. నళినీకాంతానికి వొంటినిండా పురుగులు పాకుతున్నట్లైంది. క్లాసింత అసభ్యంగా, అల్లరిగా వుంటుం దనుకోలేదు. క్రొత్తమాష్టర్ని మొదట్లో ఎంతో ఆప్యాయంగా, గౌరవప్రదంగా చూస్తారని అనుకున్నాడు. అదేమి లేదు. ఎగతాళి. అదరగొట్టటం. 'నళినీకాంతానికి కోపం ముంచుకు వచ్చింది. చివాలున కుర్చీలోంచి లేచి డ్రాయర్ని గుద్దుతూ—

'సైలెన్సు, ఏమిటి వెధవ అల్లరి' అన్నాడు, గంభీరంగా. మొదట్లో వున్న వొణుకు కాస్త పోయింది.

'ఉత్తవెధవలండీ మాష్టారూ, క్లాసంతా; కొత్త మాష్టారుదగ్గర ఎలా మసులుకోవాలో తెలీదు. తలా నాలుగు చరచండి దారికి వొస్తారు' అన్నాడు చలపతి బెంచీలోంచి లేవకుండానే, కూర్చుని దర్జాగా. నళినీకాంతానికి వాడిమీద ద్వేషం రగులుతున్నది. తనవైపు వకాల్తా పుచ్చుకొని అలా వినయవిధేయతల్ని చంపుకొని కూర్చొని దర్జాగా అనటం - మాష్టార్ని అసమర్థుడుగా చేసి అనటంలాగా తోచింది, నళినీకాంతానికి.

'నువ్వేమీ మాట్లాడక్కర్లేదు' బిగ్గరగా

అన్నాడు, నళినీకాంతం చలపతిని వుద్దేశించి.

'ఓహో! ఈ మాటలకే మాష్టారుగారికి కోపం వొచ్చిందిగామోసు - తప్పు, తప్పు ఇహ అనములెండి' అన్నాడు చలపతి - ఆ వాక్యాన్ని ఎంతవరకు వెకిలిగా అనేందుకు అవకాశం వుందో అంత వెకిలిగా అంటూ.'

'వీళ్ల నేం చేయాలి?' అని తనను తాను కఠినంగా ప్రశ్నించుకున్నాడు నళినీకాంతం. జవాబు అంత కఠినంగా రాలేకపోయింది.

నళినీకాంతం చాల నియమాలుకల మనిషి. ఛార్జీ పుచ్చుకొనేప్పుడు తన వుద్యోగ ధర్మాన్ని ఖచ్చితమైన పద్ధతుల్లో నిర్వర్తించాలి అని తన మనస్సులో అనుకున్నాడు. అంతేకాకుండా సడలని దీక్షతో పిల్లలకు పాఠాలు సక్రమంగా చెప్పి, పిల్లల్ని బాగుచేసి పేరు తెచ్చుకోవాలనికూడా అనుకున్నాడు. ఈ రెండు వాంఛలూ అతనిలో కొంత తృప్తినీ, అభిమానాన్నీ రేకెత్తించినయ్ అప్పుడు. కానీ వీటిస్థానే పరిస్థితుల మార్పువల్ల క్రౌర్యాన్ని తెచ్చుపెట్టుకోవాల్సిన అగత్యం కలిగేప్పటికి నళినీకాంతానికి మొదట తాను స్కూలును గురించీ, చదువుకొనే పిల్లల్ని గురించీ వూహించిన సదభిప్రాయాల్ని తుడిచిపెట్టుకోవటం తేలికైంది. చలపతిని మనస్సులో పెట్టుకున్నాడు. కాని అదే వుద్యోగంలో చేరిన మొదటిరోజు కావటంతో ఏవిధమైన దండన విధించటానికి ఆస్కారం లేకపోయింది.

'పంతులుగారూ! తమ దేవూరో శెలవిస్తారా?' అన్నాడు మాయమాధవుడు పక్క వినయంతో.

తన దేవూరైతే వీళ్లకెందుకు? అసలు మాష్టరు వ్యక్తిగత విషయాలు వీళ్లకు దేనికి? ఇవి కనుక్కునేందుకేనా స్కూలుకు రావటం? నళినీకాంతం 'కొత్తగావచ్చిన అందరి మాష్టర్లనీ యిలాగే యేడిపిస్తారా?' అన్న నీచాభిప్రాయానికి 'ఫీల్'అయ్యాడు.

'ఫూల్స్! ఆ సంగతంతా మీకు దేనికి?' విసుగ్గా అన్నాడు నళినీకాంతం.

'తెలుసుకుందామని' మొదట బెంచీలోని సూర్యనారాయణమూర్తి అన్నాడు మాయమాధవుడికి వూతాన్నియిస్తూ.

'అక్కర్లేదు. చదువుకోవటం మినహాయించి మాష్టర్ల సంగతి మీకు అనవసరం' నళినీకాంతం గట్టిగా.

క్లాసులో చిన్నకోలాహలం బయలుదేరింది. మధ్య బెంచీలవాళ్లు గుసగుసలు ఆరంభించారు. రెండో బెంచీలోవాళ్లు ముందున్న డస్కులమీద తలలు వాల్చి ముసిముసినవ్వులు నవ్వుతున్నారు. వెనుక బెంచీలో కొంతమంది సినిమా పాటల్ని ఆలాపన చేస్తున్నారు. క్లాసును చూస్తుంటే నళినీకాంతానికి 'మార్కెట్టు'లోని సందడి స్ఫురించింది. ఇలా అల్లరిచేయటం వీళ్లకి ఆచారంగా వొస్తున్నట్టు గమనించాడు. డ్రాయరును గుద్ది 'సైలెన్సు' అన్నాడు. కాని అల్లరి ఆగలేదు. తనమాట వినటం లేదన్న ఉడుకుమోతుతనం అధికమైంది, నళినీకాంతానికి. మాష్టర్ని 'మాష్టరు'గా చూడటాన్ని ఎప్పుట్నుంచి వొదులుకున్నారో ఈ విద్యార్థులు-అర్థం కాలేదు.

చలపతి లేచి 'సైలెన్సు' అన్నాడు. అల్లరి ఆగింది. నళినీకాంతంవంక 'నా పలుకుబడి చూడు' అన్నట్టు నవ్వుతూ కూచున్నాడు, చలపతి. నళినీకాంతం గొప్ప అవమానాన్ని ఇంతమంది పిల్లలమధ్యలో పొందుతున్నట్టు బాధపడ్డాడు. హెడ్ మాష్టరుకు రిపోర్టిస్తే - ఎందుచాతనో అసమర్థంగా అనిపించింది. టైం చూసుకున్నాడు 'పీరియడు' అవటానికి యెంత వ్యవధి వుందోఅని. ఇంకా అరగంట వుంది.

అటెండెన్సు వొచ్చింది. సుబ్బారావు అని పిలిచాడు. మొట్టమొదట 'ప్రజెంట్ సార్' అని అతను క్లాసులోవుంటే అతనే చెప్పాలి. కాని అతను అలా చెప్పనేలేదు. పైగా లేచి ప్రశ్న-పేర్లు పిలవకూడదండీ! నంబర్లు పిలవండీ సార్' అని అన్నాడు. ఎలా పిలిస్తేయేం? ఏం కొంప మునిగింది? ఇంతలోకే లేచి సలహాయివ్వాలీ మాష్టరుకి.

'సరే అలాగే నంబర్లని పిలిచాడు. నళినీకాంతం ఒన్-టు-త్రీ...అట్లా B. ఫార్టియెట్ వరకూ పిలిచాడు. అందరూ 'ప్రజెంట్ సార్'అని పిలిచారు. అనుమానం వేసి నళినీకాంతం క్లాసులోని విద్యార్థుల్ని లెక్కపెట్టాడు. నలభైమంది వున్నారు. ఆశ్చర్యంవేసింది. మరి అందరూ 'ప్రజెంట్ సార్' అన్నారే. తేలిందేమిటంటే - రానివాడి నంబరుకుకూడా వొచ్చినవాడు 'ప్రజెంట్ సార్' అనటం జరిగింది. తల వొంచుకొని అటెండెన్సు వేసుకోవటంలో మాష్టర్ని విద్యార్థులు చేసే పచ్చిమోసం ఇది. ఇటువంటి మోసాలకు అలవడ్డ మాష్టర్లు నంబరువారీగా కూచోబెట్టి నిలుచోని 'ప్రజెంట్ సార్' అనిపించటమో, పేరుని నిదానంగా పిలవటమో జరుపుతారు. కొత్తకనుక నళినీకాంతానికి ఇటువంటి మోసాలు విద్యార్థుల్లో అమల్లోవుంటమనేది యెరగడు. మళ్లా పిలిచి అటెండెన్సు సరిచేద్దామా అనుకున్నాడు. కాని అన్ని నెంబర్లను దిద్దటంవల్ల ముందుగా అంత గుడ్డిగా ఎందుకు వేశావన్న గూటింపు హెడ్మాష్టరునించి వొస్తుందేమోనని జంకాడు, నళినీకాంతం.

ఇప్పుడొచ్చిన చిక్కేమిటంటే, ఇక ముందునించీ ఆ క్లాసుకే క్లాసుటీచరు, నళినీకాంతం. అడుగులో హంసపాదమన్నట్టు- మొదట్లోనే ఆ క్లాసు వల్ల అపహాస్యాన్ని పొందాడు. అయినా ఆ క్లాసుని యే విధంగానైనా బాగుచేయాలని నిశ్చయించుకున్నాడు, నళినీకాంతం.

'ఇంగ్లీషు టెక్స్టు యిటివ్వు' అన్నాడు నళినీకాంతం ముందు బెంచీలో కూర్చొన్న సీతారామస్వామిని.

యిచ్చాడు. పొయిట్రీపార్టు తీసి ఒక విద్యార్థిని ఫలానా పొయిట్రీలెసన్ చదవమన్నాడు. వాడు ఆ లెసన్ చదవటానికి పడ్డ శ్రమ అంతాయింతా కాదు. ప్రతివర్డ్‌కీ తప్పులుపోవటమే! విసు వేసింది, నళినీకాంతానికి. కూర్చోమన్నాడు. ఇంకో విద్యార్థిని జరిగినపాఠంలో ఒక ప్రశ్న వేశాడు. జవాబు చెప్పలేకపోగా, వాడు కూర్చొనివుండే 'నాకు తెలీదండీ!' అని ధీమాగా అన్నాడు. ఇట్లా దాదాపు పాతిక మంది విద్యార్థులవరకూ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేదు. అప్పుడు తెలిసింది, నళినీకాంతానికి ఆ తరగతి విద్యావిధానం ఎటువంటి హీనస్థితిలో వున్నదీ. చలపతి అన్నాడు:

'జరిగిన పాఠాల్లో ప్రశ్న వేసి విద్యార్థుల్ని కష్టపెట్టే ఆచారం ఇంతవరకు వొచ్చిన పంతుళ్లలో లేదండీ!'

నళినీకాంతం నిర్ఘాంతపోయాడు. అయితే మాష్టర్లెందుకు? స్కూలెందుకు? చదువెందుకు? చలపతి అబద్ధాలు ఆడుతున్నాడనిపించింది, నళినీకాంతానికి. ఈ విధానమే కనుక మాష్టర్లలో పాకిపోతే చెప్పిన పాఠాల్ని చదవాల్సిన అవసరం విద్యార్థులకు కనపడదు.

'అదంతా నాకవసరంలేదు. నే చెప్పే పాఠాల్ని ఏ రోజు కా రోజు కచ్చితంగా చదవాల్సిందే. నే నడిగిన ప్రశ్నలకు జవా


## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నికొక్క, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు|| డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

ములు చెప్పనివత్తులో తగినశిక్ష విధిస్తారు' అని అన్నాడు నళినీకాంతం.

'ఏం శిక్ష విధిస్తారు - తలలు కొట్టి వేస్తారా? మెడకి గుదిబండ తగిలిస్తారా? ఎండలో నిలబెడతారా! సరిలే వెత్తాలతో వొళ్లంతా వాయగొడతారా!' అని గుక్క తిప్పుకోకుండా అన్నాడు, మాయమాధవుడు.

నళినీకాంతానికి ఉద్రేకం వొచ్చింది. తనని, తన విధానాన్ని గేలిచేస్తున్నట్టు భావించాడు.

'షటప్! ఫూలిష్ వాగుడు. దెబ్బలు తగలగలవు'

'ఇంతవరకు మేము మా మాష్టరు దగ్గరా పల్లెత్తు మాటకానీ, చిన్నం ఎత్తు దెబ్బగానీ తినలేదు. మీదగ్గర దెబ్బలు తినే దౌర్భాగ్యంకూడా మాకు పట్టదు' అన్నాడు చలపతి. క్లాసుకంతా వాడే లీడరు. పంతులుమాటకంటే వాడిమాటే ముఖ్యం విద్యార్థులకు.

ఈ విద్యార్థుల్లో 'పంతులు'అన్న పెద్ద మనిషికి ఎంత విలువుందో ఒక్క నలభై అయిదునిముషాల 'పిరీడ్'లోనే అర్థం అయింది నళినీకాంతానికి. పిల్లని నయానో, భయానో సక్రమమార్గానికి తేవాలని దృఢంగా నిర్ణయించుకున్నాడు, నళినీకాంతం. నళినీకాంతం చాల పట్టుదల గల మనిషి.

## 2

సాయంత్రం అయిదు గంటలకు నళినీకాంతం యింటికి వొచ్చాడు, బుర్రలో అనేక ఆలోచనల్ని స్థాపించుకొని. క్రిందకు దించిన పంచిపాళీ పంచబొంగుకు తల తగిలి దిమ్మరపోయాడు నళినీకాంతం. ఆ యింటికి అలవాటు పడకపోవటాన, సరిగ్గా పంచదగ్గర కొచ్చేప్పటికి వంగి నడవకపోతే పంచబొంగులు తలకు పొడుచుకుంటాయి అన్న జ్ఞాపకం అట్టడుగున పడిపోయింది. తలని సవరించుకుంటున్నాడు నళినీకాంతం. ఇదంతా భార్య చూసి అల్లంత దూరాన వుండే—

'అఁ! తగిలిందీ-మీకుకూడా! అసలే నలుగురుచాతా పొట్టిదాన్ని అనిపించుకొనే నా తలకే ఆ బొంగులు పొడుచుకొంటూంటే చెట్టంత ఎత్తున వున్న మీకు తగలటం ఆశ్చర్యమా? అదీకాక-మీ కలా తగలాలసిందేలే-నా మాట వింటే గా. ఎందుకూ ఈ వెధవ వుద్యోగం ఈ వూళ్ళో వెంట అడుక్కు తినటం-'అని తన పాఠం ఆరంభించింది.

'ఉండవే నీవు మరీను. మానవుడై ఈ భూమిమీద పుట్టింతరువాత చేసి లోకానికి వుపయోగపడాలి' అన్నాడు నళినీకాంతం.

'ఈ కబుర్లన్నీ నాదగ్గర చెప్పకండి. మనం దేశసేవకు ప్రాణాల్ని అర్పిస్తామా? ఏమిటీ?'

'అదేమన్నమాట. అంత పనీ చేయకపోతే-మన తాహతుకు తగ్గది చేదాం?'

'ఇవన్నీ నాకు నచ్చవు. నామాట వినండి. మన కేం తక్కువ, వూరు కాని వూరులో, అద్దె యిళ్లల్లో పడివుండి ఉద్యోగంచేసి జీవించటానికి. పొలంపుట్రా చూసుకోకపోయినా ఆ కవుళ్ల వాళ్లు యిచ్చేది చూసుకొని పోగుచేసుకొని హాయిగా బ్రతకొచ్చు' అన్నది నళినీకాంతం భార్య. మొదట్నుంచీ ఆమెది ఇదే వాదన. ఆమెదృష్టిలో ఈ చిన్న చిన్న వుద్యోగాలు చేసేవాళ్ళు కేవలం బ్రతకలేకే చేస్తారని. అటువంటిది బ్రతకటానికి అన్ని అవకాశాలున్న తన భర్త ఈ వుద్యోగం చేయట మేమిటి?

'నీకు తెలియదులే-' అన్నాడు నళినీకాంతం భార్య గోడును వినటానికి వోపిక లేక.

'అదుగో యేమీ సమాధానం చెప్ప చేత కాకపోతే, ఆమాటంటారు! ఈ తల కాయలు పగలగొట్టుకొంటూ ఈ వూరిళ్లలో వుండే ఖర్మ మన కెందుకు? మన వూళ్లో నిక్షేపమైన స్వంతయిల్లు లేకనా?'

'ఇది పాతగోలే' అనుకొని వూరుకున్నాడు నళినీకాంతం. అతను దీంట్లో కల్పించుకొంటే గోల విపరీతస్థితికి వొస్తుందని అతనికి తెలుసు.

'ముఖ్యంగా నీళ్ల యిబ్బందిని భరించలేకుండావున్నాము. ప్రక్కింటికెళ్లి తెచ్చుకోవాలి. వాళ్లు కాస్త మాతిముడిస్తే మన తిప్పలు దేముడి కెరుక. అదేమంటే-నీళ్లు తెచ్చేది నేను దా, ఆ అవస్థలన్నీ నేను పడతాను అంటారు. మన యిద్దర్లో ఎవరి పడితేఏం అవస్థలు, నాకుమాత్రం నొప్పిగా వుండదూ. అసలు ప్రక్కింటివారి భావిలో నీళ్లు తెచ్చుకోవటంవల్ల వాళ్లక్రింది ఇవాళ కాకపోయినా రేపైనా తక్కువతనం కాదుటండీ? పైగా ఈ వూరింటికే ఏ వసతులూ లేని ఈ యింటికే ఎనిమిది రూపాయల అద్దె. నళినీకాంతం భార్య చెప్పుకు పోతున్నది. నళినీకాంతం వినటం లేనట్టు నటిస్తూ వింటున్నాడు.

'ఇక్కడ వాళ్లిచ్చే జీతంకూడా చాలటం లేదయ్యె, కాఫీలకూ, యింటిఅద్దెకూ, తిండికీ. అటువంటప్పుడు నానాఅవస్థలూ పడుతూ మీరు నోరగబెట్టే దేమిటీ? అదీ [illegible] గాక మీరు ఇంట్లో లేని సమయంలో నా కేమీ తోచటంలేదు. ఇక్కడి ఆడవాళ్లతో నాకు మాట్లాడ బుద్ధేవెయ్యదు.'

'అలవాటుపడాలి, ఈ వాతావరణానికి. ఆపైన ఎక్కడవున్నా ఒకటే ననిపిస్తుంది.' ఇటువంటి చచ్చుజవాబులు చెప్పేందుకు భర్తగారికి మనస్సెట్లా వొప్పుతుందో అనిపించింది నళినీకాంతం భార్యకు.

తను చెప్పినందువల్ల యేమీ లాభంలేదని తెలుసుకున్నదై వూరుకొంది నళినీకాంతం భార్య. స్కూల్లో ఆ గోలా, యింటిదగ్గర ఈ గోలా తనకి శాంతిలేకుండా పోతున్నదని విసుక్కున్నాడు నళినీకాంతం.

ఎనిమిది గంటలకు అన్నం వడ్డించి ఎదురుగ్గా కూచొంది నళినీకాంతంభార్య. నళినీకాంతం తల వొంచుకొని తింటున్నాడు. కూరా అన్నం సాంతం తినకుండానే 'మజ్జిగ' అన్నాడు.

'ఏం అంతా వొదిలిపెట్టారేం? అన్నం సయించటంలేదా? అయినా ఎట్లా సయిస్తుందిలెండి. మన చేలో పండిన వడ్లు కాదుగా అన్నం శుభ్రంగా వుండేందుకు. రేషనుబియ్యమాయె. సకల మలినపదార్థాలూ వాటిల్లో వుంటవి. బలవంతాన తిన్నా రేపొద్దునకు యేదో రోగం పుట్టుకువొస్తుంది. నామాట వినండి. కానిచోట రోగాలపాలయ్యేగతిని ఎందుకు సృష్టించుకోవాలి' అన్నది నళినీకాంతం భార్య, మజ్జిగ తెచ్చేందుకు లేస్తూ.

'ఫరవాలేదు. ఈ రేషనుబియ్యం తిన్నవాళ్లందరికీ కనుక రోగాలు వొస్తే ఇదివరకే భారతదేశంలో చాలమంది చచ్చివుండాల్సింది' అన్నాడు నళినీకాంతం పాడి అన్నాన్ని వేళ్లతో కలుపుతూ.

'సరే నా మాటను యిప్పుడు యిట్టే త్రోసివేసినా రేపు మీకే తెలిసిరాగలదు' అన్నది నళినీకాంతం భార్య.

'తెలిసివొచ్చేది యేమీ వుండదు. ఉద్యోగంలో చేరాను. ఆ ఉద్యోగధర్మాన్ని సక్రమంగా, న్యాయమార్గంగా నెరవేర్చటమే నా విధి. అటువంటప్పుడు తెలిసిరావల్సింది యేమీ వుండబోదు' అన్నాడు నళినీకాంతం.

అవతలవాడి విషయంలో తను

కుష్ఠు ★ బొల్లి
వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

న్యాయంగా ప్రవర్తిస్తే-వాడు కూడా తన విషయంలో న్యాయంగా ప్రవర్తిస్తాడు అన్న నమ్మకం ఇంకా నళినీకాంతంలో క్షీణించలేదు. అంతేకాకుండా ఒక సంస్థ నించి తను డబ్బు తీసుకొనేప్పుడు కష్టించి ఆ డబ్బుకు తగిన పని ఆ సంస్థకు చేయాలి అన్న అభిప్రాయంకూడా అతనిలో పనిచేస్తూన్నది. తను మాష్టారు వుద్యోగంచేస్తూ బోర్డునించి నెలనెలకూ జీతం తీసుకొంటూ, తను బద్ధకంగా అశ్రద్ధచేయకండా పిల్లలకి సక్రమంగా చదువుచెప్పాలి అని నిర్ణయించుకున్నాడు, నళినీకాంతం ఉద్యోగంలో చేరిన రోజునే. అతనిలో కాలానికి వర్తించని న్యాయబద్ధమైన భావాలు కొన్ని జీర్ణించుకొని వున్నవి. వాటివల్ల ఇంతవరకు నళినీకాంతానికి ఎటువంటి బాధ కలుగలేదు, తను స్వతంత్రంగా బ్రతుకుతూ తనలోని అధికారాన్ని తనమీదకే ప్రయోగించుకొంటూ వొస్తున్నాడు కనుక. తనలోని అధికారాన్ని న్యాయబద్ధమైన భావాల రీతిగా, ఇంకోకళ్ళమీదికి ప్రయోగించటంలో ఇంతవరకూ తన జీవితంలో వుంటూ వొచ్చిన శాంతి వుండదని గ్రహించలేకపోయాడు, నళినీకాంతం. ఎదుటవాడికి అపకారం తలపెట్టి చేస్తూ, నలుగురుచాతా ఉపకారం చేస్తున్నాడని అనిపించుకొనే పలుకుబడిగల మనుష్యులు ఈ లోకంలో వుండి అశాంతిని రేపుతున్నారనిన్నీ, నిర్ణయానుసారంగా తాము డబ్బు సంస్థనుండి తీసుకొంటూ చేయవలసిన విధుల్ని చేయకండా, బద్ధకాన్ని, స్వార్థాన్ని అపేక్షించి ప్రక్కదారులు తొక్కుతూ, తమని నమ్ముకున్న సంస్థకి అన్యాయంచేస్తూన్న మానవులు వుండి దేశంలో లంచాన్ని, అవినీతినీ పెంపొందిస్తున్నారనిన్నీ, నళినీకాంతం వూహించలేదు. ఎవ్వరిదగ్గరా విననుకూడా వినలేదు. ఈ విషయాలు అతని జీవితానికి ఇంతదనుకా అంటని రహస్యాలుగా దూరంగా వున్నయ్. అవి నళినీకాంతంలో ప్రవేశించినరోజు ఈ లోకంలో అతను హాయిగా బ్రతుకుతూ, పైకి పోగల భవిష్యత్తు వుంటుంది. వాటిని దూరంగా వుంచినంతకాలమూ, కూపస్థమండూకానికీ నళినీకాంతానికీ తారతమ్యం లేదు. కొన్ని సమయాల్లో వాటిని దరికి చేరనీయకపోవటంవల్లనే చిన్నచిన్న ప్రమాదాలు సంభవిస్తూ వుంటాయి. కాని అందువల్ల నళినీకాంతం మానసికంగా 'ఫీల్' అయినా ఆర్థికంగా బాధపడేదిలేదు.

## 3

ఇవాళ చెప్పిన పాఠంలో మగవాడు ప్రశ్న వేస్తూంటే జవాబులు చాలా తక్కువ మంది చెబుతున్నారు. వాళ్ళయినా చాలా చిన్ని ప్రశ్నలకు. దాన్నిబట్టి చెప్పిన పాఠాల్ని చదువమని మాష్టరు గొంతుచించుకున్నా యేమీ లాభంలేకపోతున్నదనీ, మాష్టరంటే ఏ విద్యార్థికీ లక్ష్యం లేదనీ తేలింది. ముఖ్యంగా చిలిపి చలపతీ, మాయ మాధవుడూ నళినీకాంతాన్ని 'మాష్టరు' దృష్టిలో చూడటంలేదు. వాళ్లు ప్రతి మాష్టర్ని ఆ చూపుతోనే చూస్తారన్న సంగతి నళినీకాంతానికి తెలీదు.

ఆ ఇద్దరు స్టూడెంట్సునుగురించి కొంత చెప్పవలసివుంది, మరి. హెడ్ మాష్టరు సహితం వాళ్ళిద్దర్ని పల్లెత్తుమాట అనడు. భయం. వాళ్లని చూస్తే ప్రతి టీచరుకూ అంతో ఇంతో భయమే. పిల్లలకుకూడా భయమే. ఆ స్కూలు చదువులో అంత అధ్వాన్నంగా వుండటానికి కొంతవరకు వాళ్ళిద్దరు బాధ్యులు. ఏమీ చదువురాని విద్యార్థిని మాష్టరు కొట్టటానికి లేదు. అట్లా కొట్టినయెడల వాళ్లిద్దరు బజార్న పోతోన్న పంతులకే రాళ్లువిసరటమో, విసిరిపించటమో చేస్తారు. దెబ్బలు తగిలే సంగతి అటుంచి ముఖ్యంగా ఎంత అవమానం? అందులో చిలిపి చలపతి బాగా డబ్బుగల ఆ గ్రామం పంచాయితీబోర్డు ప్రెసిడెంటు కొడుకు. మాయమాధవుడు పంచాయితీబోర్డుకి ప్రెసిడెంటుకు అండగా వున్న మరో లక్షాధికారి కొడుకు. అందువల్ల వాళ్లిద్దరి విషయంలో ఎవ్వరూ కల్పించుకొనేందుకు వీల్లేకపోతున్నది. చిలిపి చలపతితండ్రికి ఆ గ్రామంలోనే కాకుండా జిల్లాబోర్డులో కూడా మంచిపేరున్నది. ఆయన మాటని కాదనేవాడు లేడు. కొడుకులు యే చిలిపి పనిచేసినా చిలిపిపనులుగా గుర్తించకుండా ఘనంగా అనుకొనే తండ్రులిద్దరూనూ. అటువంటప్పుడు ఆపిల్లలిద్దరి ప్రతిభ దేదీప్యమానంగా సాగక ఎందుకుంటుందీ? ఇంకో విషయ మేమిటంటే: ఆ వూరికి ఆ హైస్కూలు వొచ్చేందుకు ఆ పిల్లల తండ్రులదే ముఖ్యశ్రమ.

ఒకరోజున నళినీకాంతం ట్వెల్వ్‌లైన్సు రెసిటేషన్‌పొయిట్రి చెప్పి వారంరోజుల్లో ప్రతి విద్యార్థినీ ఖచ్చితంగా వొప్పచెప్పమన్నాడు. లేనిపక్షంలో కఠినంగా శిక్షిస్తానన్నాడు. అందులో అతని తప్పులేదు. పంతులమాట అవశ్యం విద్యార్థి వినవలసిందే - చదువువిషయంలో. లేకపోతే ఆ విద్యార్థికి చదువు రావటంఅనేది అసంభవమైన విషయం. తాను చెప్పిన పాఠాలు వల్లించుకురాకపోతే, హోంవర్కు చేయకపోతే మాష్టరు విద్యార్థిని కొడతాడు. ఈ దఫాఅయినా తాను చేయమన్న పని చేస్తాడని. అందువల్ల మాష్టర్ని తప్పుపట్టాల్సిన అవసరం మనకు లేదు.

వారంరోజులు గడిచాక రెసిటేషన్ వొప్పజెప్పమన్నాడు. క్లాసులో యే విద్యార్థీ వొప్పచెప్పకపోగా కనీసం వొప్పజెప్పేందుకుకూడా ప్రయత్నించలేదు. నళినీకాంతం మండిపడ్డాడు. 'ఎందుకు చదవలేదు?' అని అతి కఠినంగా ప్రశ్నించాడు.

కొంచంసేపున్నమీదట ఒక విద్యార్థి లేచి—

"చలపతి చదవొద్దన్నాడు" అన్నాడు.

నళినీకాంతానికి అక్కసు అధికమైంది. వీడు క్లాసు కంతటికీ అధికారియైన నామాటను క్లాసులో విలువలేకుండా చేస్తున్నాడు? దగ్గరకు పిలిచాడు నళినీకాంతం చలపతిని. 'ఏమిటి నీ తుంటరితనం' అనేసి ఆ చెంపా ఈ చెంపా బలంగా వాయించాడు నళినీకాంతం.

చలపతి అన్ని దెబ్బల్ని భరించికూడా యేమీ పల్లెత్తుమాట అనలేదు. ముఖాన్ని గాంభీర్యంగా ప్రశాంతంగా వుంచాడు. ముందుముందు యేం విపరీతం జరగనున్నదో అని విద్యార్థులు మాష్టరు ముఖంకేసి, చలపతి ముఖంకేసి నిశితంగా దృష్టుల్ని సారిస్తున్నారు. ఈ సంఘటనవల్ల ఈ క్షణాన కాకపోయినా ఇంకోకప్పుడైనా మాష్టరుకు యేదో ఒక ప్రమాదం సంభవిస్తుంది - అని విద్యార్థులు లోపల లోపల అనుకోసాగారు.

సాయంత్రం స్కూలు వదిలిపెట్టే వేళకు క్రొత్త మాష్టరు ఫలానా చలపతిని కొట్టాడన్న సంగతి మాష్టర్లకీ, విద్యార్థులకీ తెలిసింది. స్కూలునించి యింటికి వొస్తూన్న సమయంలో త్రోవమధ్యన లెక్కలమాష్టరు నరసింహశాస్త్రిగారు కలిశారు, నళినీకాంతంతో.

"మీరు చలపతిని అలా కొట్టటం శ్రేయస్కరం కాదోయ్!" అన్నారు నరసింహశాస్త్రిగారు.

నళినీకాంతం తడబిడపడ్డాడు. ఎందుచాత? తను ఆచరించిందాంట్లో ఒకళ్లు తప్పు పట్టవలసిన అవసరం ఎక్కడుంది? మాష్టరు చెప్పినమాట తాను వినకపోగా క్లాసు సంతటినీ వినకుండాచేసే విద్యార్థిని మాష్టరు కొట్టకుండా ఎలా వుండగలడు?

'ఏమిటి అట్లా అంటున్నారు?' అన్నాడు నళినీకాంతం.

'చలపతి చేసిన పనిని సమర్థించను. వక్రమైనపనే. కాని అట్లా కొట్టడంవల్ల ఆ

విద్యార్థివల్ల మీకేమన్నా ప్రమాదం సంభవించవచ్చు. వాడు ఆకతాయి వెధవ' అన్నారు నరసింహశాస్త్రిగారు.

'ఈ విధంగా విద్యార్థులకు దడిచి మాష్టర్లు తమ ఉద్యోగధర్మాన్ని మర్చిపోయి స్కూలులో సువిద్యను ప్రవేశపెట్టకుండా వుండటం మంచిదంటారా?' అన్నాడు నళినీకాంతం.

'మనకు వశంతప్పిపోయిన విషయాలలో తలదూర్చి రోకటిపోట్లు తినటాన్ని మనం సహించగలమా? ఉద్యోగధర్మం అన్నది కొనసాగేదగ్గరే. అన్నిచోట్లా అలా చేయలేం. మాష్టర్లమాటలు విద్యార్థులు వినే కాలం గతించింది. విద్యార్థుల మాటలు మాష్టర్లు వినే కాలం ప్రవేశించింది.' అన్నారు నరసింహశాస్త్రిగారు, యథార్థాన్ని వెళ్లగక్కుతూ.

'అట్లా నిస్పృహ పోకూడదండీ? మాష్టర్ల మాటలను విద్యార్థులు వినేట్టు చేయాలి, నయానో భయానో' అన్నాడు, నళినీకాంతం.

నరసింహశాస్త్రిగారు యేమన లేదు. ఇల్లు సమీపించటంతో వాదనలోంచి తొలిగారు. తోటి మాష్టర్లలో కూడా విద్యార్థులనుగురించి విద్యనుగురించి చచ్చు అభిప్రాయా లుంపటం - నళినీకాంతానికి జుగుప్సని కలిగించింది.

ఆ వేళ గురువారం. సాయంత్రం ఆరు గంటలకు షికారుకు కాలవకట్టకు వెళ్లాడు, నళినీకాంతం. నిత్యం వాహ్యాళి నళినీకాంతానికి ఈ వూరు వొచ్చాక తీరని అలవాటుగా పరిణమించింది. యేడూ, యేడున్నర గంటలవరకూ కాలవకట్ట మీద కూచుని మంచిగాలిని పీలుస్తూ వుంటాడు. ఆ రోజు నకూడా అలానే వుండి బాగా చీకటి పడింతరువాత ఇంటికి కెళ్దామని లేచి పది గజాలదూరం నడిచాడు. ముందుగా ఒక ర్యాయి ఎక్కణ్నుంచో కొచ్చి విసురుగా పడింది. నిర్విణ్ణుడై నిలబడ్డాడు. రెండోరాయి వొచ్చి తలకు బలంగా తగిలింది. 'అబ్బా!' అని తలను చేత్తో అదిమి పట్టుకున్నాడు. క్షణం గడిచాక చేతికి తడి తగిలింది - రక్తం చిందుతున్నది. అదిరిపడి చుట్టూ చూశాడు. ఎవరూ కనపడ్లేదు.

రెండుగజాలు ముందుకు నడిచాడు. బిగ్గరగా నవ్వుతూ నలుగురు పిల్లలు చెట్లచాటునించి వొచ్చారు. దిగాలుపడి వాళ్లవంక చూశాడు; నళినీకాంతం - అదే వున్నవూరువాడైతే ఆ పిల్లల్ని చావమోదేవాడు.

'జాగ్రత్తగా మసులుకోండి. స్కూల్లో పిల్లల్ని కొట్టటం అంత లేలిగ్గా వుందనుకొన్నారా?' అన్నారు ఆ పిల్లలు'

నళినీకాంతం తల వొంచుకున్నాడు. హృదయంలో కోపం రగిలిపోతున్నది. ఇది తప్పకుండా చలపతి చేయించిన దుష్టచర్య అనుకున్నాడు. ఆ చీకట్లో ఆ పిల్లలు ఎవరైందీ గుర్తు తెలియకండా వుంది, నళినీకాంతానికి. ఇక అక్కడ వుంటే మర్యాదకు భంగకరమని, గబగబ పెద్ద అడుగులు వేసుకొంటూ, వెనక పిల్లలు గోలచేస్తూన్నా ఆలకించకుండా యింటికి వొచ్చాడు.

## 4

తలమీద అంతపెద్ద గాయాన్ని చూసి భయపడింది, నళినీకాంతం భార్య.

'అకేమిటండీ?, అన్నది అక్కజపడుతూ.

'ఏం లేదులే - ఏదో ఒస్తూంటే, పొడుచుకొంది' అని నీళ్లు నమిలాడు నళినీకాంతం.

'ఎక్కడ పొడుచుకొందీ! పంచపాళీయా?'

'ఊఁ!' అన్నాడు, నళినీకాంతం. జరిగిన పరాభవం భార్యకు తెలీటం యిష్టం లేదు. ఉద్యోగానికి నీళ్లు వొదులుకొని వెంటనే తనవూరు వెళ్దామంటుంది. అంచాత నళినీకాంతం చిన్ని అబద్ధమాడాడు.

'నామాట యిప్పుడు తెలిసివొచ్చింది. ఎందుకు చెప్పండి ఈ బాధంతా? చూడండి ఎంత దెబ్బ తగిలిందో - ఇప్పటికైనా నామాట వినండి. మనవూరు వెళ్దాం.' అని పాతపారాన్ని వల్లించింది, నళినీకాంతంభార్య, తడిగుడ్డను తలకు చుడుతూ.

నళినీకాంతం మాట్లాడలేదు. చలపతి మీద అరికాలిమంట నెత్తికెక్కుతున్నది. వెధవ ఎంతకు తెగించాడు? నళినీకాంతం భార్య గాయానికి మందు వేస్తూ చిన్న వుపన్యాసాన్ని దంచుతున్నది.

'మనకేం తక్కువ - ఈ వెధవవుద్యోగం చేయడానికి. ఈ అద్దెయిళ్లలో నానా యిబ్బందులూ పడటానికి. నేను మొదట్నుంచీ మొత్తుకుంటూనే వున్నా - విన్నారుకాదు. ఇంకా ఇప్పట్లో మీకు తెలిసిరాదులే. ఇంకా యేదో పెద్ద ప్రమాదం వచ్చేవరకూ. మన దురదృష్టానికి తగ్గట్టు యింత వూరులో ఈ వూరిల్లే అద్దెకు దొరకాలీ?'

'అబ్బా! కట్టిపెట్టవే నీ గోల' అని విసుక్కున్నాడు నళినీకాంతం.

'ఇదుగో! మొదట్నుంచీ ఇట్లా విసుక్కోవటంతూలాన్నే, నా మాటల్ని చెవిన పెట్టడంవల్లనే - ఇంతవరకూ వొచ్చింది. ఇంతకీ బుద్ధితక్కువ నాది' అని వూరుకుంది నళినీకాంతంభార్య.

మరునాడు నళినీకాంతానికి స్కూలుకు వెళ్ళేందుకు మనస్కరించలేదు. వారం రోజులు శెలవుపెట్టాడు. ఇంకో వారం రోజులకు క్రొత్త మాష్టారుకు జరిగిన పరాభవం స్కూలుమొత్తానికి తెలిసింది. నళినీకాంతం హెడ్‌మాష్టరుకు చెప్పాడు. పైగా చలపతిమీద చర్యతీసుకోమని అన్నాడు.

హెడ్‌మాష్టరు నవ్వి - 'వాడిట్లా చేయటం క్రొత్త కాదు. కోపం వస్తే మాష్టర్లనేమిటి? నన్ను కూడా కొడతాడు. అందుచాత వాడి జోలికి ఎవ్వడూ పోడు.' అని చప్పరించాడు.

స్కూలులో అల్లరిచేసే ఒక విద్యార్థి విషయంలో యింత అశ్రద్ధగా హెడ్‌మాష్టరు ఎందుకుంటున్నాడో అర్థంకాలేదు, నళినీకాంతానికి. స్కూలును సరైన పద్ధతుల్లో వుంచటం హెడ్‌మాష్టరు వుద్యోగధర్మం. దానిని మరవటంలో హెడ్‌మాష్టరు ఉద్దేశ్య మేమిటి?

'వాడి విషయంలో మీ రింత అసమర్థంగా వుండటం సమంజసంగా లేదు' అన్నాడు నళినీకాంతం.

హెడ్‌మాష్టరుకి కోపం వచ్చింది. 'వాడి విషయం మీకు తెలీదు. మెదలకుండా వూరుకోండి.'

నళినీకాంతం పాఠాల్ని సక్రమంగానే చెప్పకుపోతున్నాడు. కాని విద్యార్థుల మాటలు కొన్ని వినకతప్పటం లేదు. చెప్పిన పాఠాల్లో ప్రశ్నలు వేయటం లేదు. కాంపోజిషన్ వ్రాయనివాళ్లను యేమనటం లేదు. రెసిటేషన్ వొప్పజెప్పనివాళ్లని యేమనటం లేదు. ఇందువల్ల తను ఉద్యోగధర్మాన్ని కోల్పోతున్నాడని బాధపడుతున్నాడు. కాని సంవత్సరాంతపరీక్షలో ఇంగ్లీషు పేపర్లు దిద్దటంలో తాను చాల నియమంగా వుండాలని గట్టిగా తీర్మానించుకోవటంతో ఆ బాధ కొంత సడలిపోయింది.

క్వార్టర్లీ, హాఫ్‌యర్లీ యగ్జామినేషన్లు జరిగిపోయినయి. నళినీకాంతం యింగ్లీషు పేపర్లు చాలా ఖచ్చితంగాచూశాడు. అందువల్ల క్లాసులో పదిహేను మార్కులకుమించి యిద్దరుముగ్గురుకు తప్ప ఎవ్వరికీ రాలేదు. చలపతికీ, మాయమాధవుడికీ రెండు పరీక్షల్లోనూ అయిదు మార్కులకు మించి రాలేదు.

భార్యపోరును భరించలేక అద్దెయిల్లు

(47-వ పేజీ చూడండి)

# ఉద్యోగ ధర్మం

(14-వ పేజీ తరువాయి)

మార్చాడు, నళినీకాంతం. అందువల్ల యిప్పుడు కొంత పోరు తగ్గింది.

## 5

యాన్యువల్ యగ్జామినషన్స్ అయిపోయినయ్. నళినీకాంతానికి ఇంగ్లీషు పేపర్లు వొచ్చినయ్, దిద్దేందుకు.

ఇక మాష్టర్లచుట్టూ పిల్లల తలిదండ్రులు తిరగడం అంతులేదు. ఈ సమయాల్లోనే కొన్ని మాష్టర్ల జేబులు నిండేవి. సంవత్సరం పొడుగునా చదవకుండా అల్లరి-చిల్లరగా విద్యార్థులు తిరిగేదున్నూ - పరీక్షల్లో బ్లాంక్ పేపర్సు పొచ్చివొచ్చేదున్నూ, తండ్రుల్ని తీసుకొని మాష్టర్లని ఆశ్రయించేది - ఇదే యిప్పటి విద్యార్థుల్లో అమల్లో వున్న దురాచారం. డబ్బుగల తలిదండ్రులు పఠి యిస్తాం - పాతిక యిస్తాం అని మాష్టర్ల చుట్టూ తిరుగుతూ లంచాలు నేర్పుతారు. ఆపైన తమ కొడుకుల తెలివితక్కువతనానికీ, చదవని నేరానికీ పల్లెత్తుమాటకూడా అనరు. మాష్టర్లు అనేకరకాలైన మనస్తత్వాల్ని జీర్ణించుకొనివుంటారు. దయతలిచి మార్కులు వేసేవాళ్లు - డబ్బు తీసుకొని మార్కులు వేసేవాళ్లు - ముఖమాటంకొలదీ మార్కులు వేసేవాళ్లు - పై మూడు పద్ధతులకూ లొంగక నియమంప్రకారం ఖచ్చితంగా మార్కులు వేసేవాళ్లు. ఈ చివరరకంగా ఖచ్చితంగా మార్కులువేసే మాష్టర్లని లోకం హర్షించదు. ఏమైనా ఆ రకానికి చెందినవాడే నళినీకాంతం.

నళినీకాంతంచుట్టూ మార్కులకోసం తిరుగుతున్నారు, విద్యార్థులూ, విద్యార్థుల తలిదండ్రులూ. ఇంకో తమాషా యేమిటంటే ఆ స్కూల్లో విద్య తక్కువ - పాఠాలు వల్లించేవాళ్లు తక్కువ - ప్రతివాడిలోనూ పేపర్లు దిద్దేది మన వూరు మాష్టర్లేగా? అన్న అలక్ష్యం బలిసిపోయింది. అందుచాతనే స్కూలు ఫైనలుపరీక్షలో ఆ స్కూల్లో ముగ్గురు నలుగురికంటె ఉత్తీర్ణులు కారు. నళినీకాంతం మార్కులుకోసం తనదగ్గరకు వొచ్చినవాళ్లని తక్కువగా మాట్లాడుతున్నాడు. విసుక్కుంటున్నాడు. అతనిదగ్గర వున్నది యింగ్లీషు పేపరు కనుక - ఎక్కువ మందికి 'నాట్' యింగ్లీషులోనే వుంటుంది కనుక అతనిదగ్గరకు మార్కులకోసం చాలా మంది వొస్తున్నారు. నళినీకాంతం ఒకే పట్టుదలతో వున్నాడు. 'నేను అనవసరంగా మార్కులు వేయను. నా ఉద్యోగధర్మంప్రకారం - మార్కులు వేస్తాను.' బ్రతిమాలేవాళ్లు బ్రతిమాలుతున్నారు. తిరిగి వెళ్లేవాళ్లు వెళ్లుతున్నారు. డబ్బులిచ్చేవాళ్లు డబ్బు ఆశ చూపిస్తున్నారు. కాని నళినీకాంతం లొంగటంలేదు.

'ఇదేమిటండీ - ఈ రామణ ధాడి!' అంటూంది నళినీకాంతం భార్య. 'నీకు తెలియదులే!' అంటాడు నళినీకాంతం.

ఒకరోజున చలపతి తండ్రీ, మాయమాధవుడి తండ్రీ వొచ్చారు - కొడుకుల మార్కులకోసం.

'నేను అధర్మంగా అర మార్కుకూడా వెయ్యటంలేదు.' అని అన్నాడు నళినీకాంతం.

'పోనీలెండి. ఎవరి సంగతో మనకు దేనికి? మా పిల్లవాడిసంగతి చూడండి. ఏవో తక్కువైన మార్కుల్ని వేసేయండి' అన్నాడు చలపతి తండ్రి. స్వవిషయంలోకొచ్చేటప్పటికి ఎంత పెద్దమనుష్యులైనా స్వార్థానికి దాసోహమనటం ఈ మనుష్యుల్లో అనాదినించీ పాతుకుపోయివుంది.

'క్షమించండి. నేను ఖచ్చితమైన మనిషిని. వొచ్చినదానికంటె ఒక్కమార్కు ఎక్కువ వెయ్యను.' అన్నాడు నళినీకాంతం.

'వెయ్యాలి. వెయ్యకపోతే యెట్లా?' అన్నాడు మాధవుడి తండ్రి నొక్కి పలుకుతూ.

'యేమైనా కానీండి. నేను అట్లా మార్కులు వేసే మనిషిని కాను' అన్నాడు నళినీకాంతం.

'మమ్మల్ని చూసైనా వెయ్యక తప్పదు' అన్నాడు చలపతి తండ్రి - ఆ వూరి పంచాయితీ బోర్డు ప్రసిడెంటు, ఆ స్కూలు వొచ్చేందుకు ముఖ్య కారకుడు, తన హోదాను ప్రకటిస్తూ.

'వెయ్యదలచుకోనప్పుడు ఒకళ్ల లావును చూసి వేసే మనస్తత్వం నాది కాదు.' అని గంభీరంగా అన్నాడు నళినీకాంతం.

'అంతేనా?' కోపాన్ని వ్యక్తంచేస్తూ అన్నాడు, మాయమాధవుడి తండ్రి, లక్షాధికారి.

'అవును' అని తొణకకుండా పలికాడు, నళినీకాంతం.

వాళ్లిద్దరూ లేచిపోయారు. నళినీకాంతం తన వుద్యోగధర్మాన్ని తాను నిలబెట్టుకోగలిగినందుకు గర్వించాడు. వారంరోజుల్లో పేపర్లన్నీ దిద్దేశాడు. కాని ఒక్కడిని మినహాయించి అందరకూ పదిహేను మార్కులలోపే. చిలిపి చలపతికి - నాలుగున్నర మార్కులూ, మాయమాధవుడికి మూడు మార్కులూ వొచ్చినవి. ఆ పేపర్లని హెడ్ మాష్టరుకు అందజేశాడు.

ఒక మధ్యాహ్నం బజారునించి వొస్తూంటే ఒక వ్యక్తి ముసుగుకప్పుకొని వొచ్చి, నళినీకాంతాన్ని నిలవేసి - 'నువ్వు అంత ఖచ్చితమైన మనిషివా?' అని చంపకేసి కొట్టాడు. దూరంగా అరుగులమీద కూచొన్న నలుగురూ పకాపకా నవ్వారు. ఆ నవ్విన వాళ్లలో మాయమాధవుడి తండ్రికూడా వున్నాడు.

నళినీకాంతానికి ప్రపంచమంతా మోసంతో నిండివున్నట్టు - అధర్మమే జయిస్తున్నట్టు కనపడింది.

## 6

స్కూలు తెరిచారు. ఇంగ్లీషులో నాలుగున్నరమార్కులు వొచ్చిన చలపతీ ప్యాసయ్యాడు. మూడు మార్కులు వొచ్చిన మాయమాధవుడూ ప్యాసయ్యాడు. నళినీకాంతం అపరిమితమైన ఆశ్చర్యపడ్డాడు. తను ఉద్యోగధర్మప్రకారం దిద్దినా యేమీ లాభం లేకపోయిందని తెలుసుకున్నాడు. చూడగా చూడగా అతనికి - తాను ఉద్యోగధర్మాన్ని నిర్వర్తించాలని అనుకొని ఆ ప్రకారమే సక్రమంగా పాఠాలు చెప్పి, సక్రమంగా పేపర్లు దిద్దితే - చివరకు మిగిలింది, - తన మాట కించిత్తు చెల్లకపోగా, చెంపదెబ్బలు, రాళ్ల దెబ్బలు.

నళినీకాంతానికి ఈ భావం వుదయించగానే కంపించిపోయాడు. నిజానికి ఈ లోకంలో తావులేనట్లు కనపడింది - తావు వున్నదని, తాను ఉద్యోగధర్మంప్రకారం ప్రవర్తించటం ఎంత తెలివితక్కువతనమో, తెలిసివొచ్చింది.

వారంరోజుల్లో ట్రాన్స్ఫర్ వచ్చింది - నళినీకాంతానికి. ఆ ట్రాన్స్ఫర్ను తెప్పించిందెవరో కాదు. మాయమాధవుడితండ్రీ, చిలిపి చలపతి తండ్రీను. ఇటువంటి ఖచ్చితమైన మాష్టరు తమ స్కూల్లో వుండ తగడని. ఆ ట్రాన్స్ఫర్ ఫల్నాడు తాలూకాకి.

నళినీకాంతం భార్య గోలపెట్టింది. 'ఉద్యోగం మానుకోండి. మన వూళ్లో పొలం పుట్రా చూసుకొంటూ హాయిగా వుండొచ్చు. నామాట వినండి. పల్నాడులో బియ్యం దొరకవు. కూటికి వాచి చావాల్సి వొస్తుంది. రోగాలపాలు కావాల్సి వొస్తుంది.'

నళినీకాంతం 'సరే' నన్నాడు. ★